సాక్షి ఖమ్మం

శనివారం । 30 । డిసెంబర్ । 2023



.. సద్వినియోగం చేసుకోండి

సంక్షేమ పథకాల అమలుకు నిర్వహిస్తున్న సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నోడల్ అధికారి రఘునందన్‌రావు సూచించారు. 10లో



ఖమ్మం మార్కెట్‌కు మహర్దశ

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌గా మోడల్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించగా రాష్ట్రస్థాయి అధికారుల బృందం పరిశీలించింది. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 30° / 17°

జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత కొద్దిగా పెరిగే అవకాశముంది. ఉదయం, రాత్రి మాత్రం చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

11 మంది వైద్యులకు స్థానచలనం

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న 11మంది వైద్యులను అధికారులు బదిలీ చేశారు. జిల్లాలోని వివిధ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులకు బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని అనుసంధానిస్తూ మెడికల్ కళాశాల ఏర్పాటు చేయగా తరగతులు ప్రారంభమయ్యాయి. ఆస్పత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లడంతో ఇందులో పనిచేస్తున్న వైద్యవిధాన పరిషత్‌వైద్యులు, సిబ్బందిని విడతల వారీగా బదిలీ చేస్తున్నారు. ఇందులో భాగంగానే వైద్యులు ఎస్.మంగళ, కె.ప్రియాంక (గైనకాలజీ), ఆర్.చైత్ర(పీడియాట్రిక్)ను నేలకొండపల్లికి, డాక్టర్ ప్రదీప్‌రెడ్డి(అనస్తీషియా), ఎం.నాగేశ్వరరావు(జనరల్ మెడిసిన్), కె.స్వాతి(పీడియాట్రిక్), సీహెచ్.గౌరీప్రశాంతి(గైనకాలజీ)ని తిరుమలాయపాలెంకు, వైద్యులు కె.శ్రీధర్(ఆర్థో), ఈ.వెంకటేశ్వర్లు(జనరల్ సర్జన్), కె.ప్రసన్నజ్యోతి, ఎస్.కే.ఆస్మా(గైనకాలజీ)ను మధిరకు బదిలీ చేస్తూ జీజీహెచ్ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు.

పల్లె దవాఖానాను సందర్శించిన 'ఎన్‌క్వాస్'

చింతకాని: చింతకాని మండలం ప్రొద్దుటూరు పల్లె దవాఖానాను జాతీయ నాణ్యతా ప్రమాణాల అధికారుల(ఎన్‌క్వాస్) బృందం శుక్రవారం సందర్శించింది. దవాఖానాలో సౌకర్యాలు, ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీసి రికార్డులు పరిశీలించారు. డాక్టర్ సుమన్‌దేవ్ చక్రభూతి, డాక్టర్ సనా అమరిన్, వైద్యులు అల్తాఫ్, సోయల్, ఉద్యోగులు కృష్ణారావు, గ్రీష్మ, నవ్య, సౌజన్య, నాగమణి, రత్నకుమారి, లక్ష్మి, రమ, సైదులు, వెంకట్, శ్రీనివాస్, సునీల్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడే జాతీయ లోక్ అదాలత్

ఖమ్మం లీగల్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం జిల్లాలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నారు. ఇప్పటికే ముందస్తు లోక్‌అదాలత్ నిర్వహిస్తూ కేసులను పరిష్కరిస్తున్నారు. ఇక శనివారం జిల్లా జడ్జి టీ.ఎస్.జగ్జీవన్‌కుమార్ ఆధ్వర్యాన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనుండగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అబ్దుల్ జావీద్ పాషా ఆధ్వర్యాన బెంచ్‌లు ఏర్పాటుచేశారు.

మొదలైన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వరరెడ్డి జనగామ ఎమ్మెల్యేగా గెలవగా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఎన్నికలు జరగనున్నాయి. ఈమేరకు ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉండగా ఫిబ్రవరి 24న ముసాయిదా జాబితా విడుదల చేస్తారు. ఫిబ్రవరి 24నుంచి మార్చి 14వరకు అభ్యంతరాలను స్వీకరించి ఏప్రిల్ 4న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నారు. కొత్త ఓటరు జాబితాలో పేరు నమోదైతే ఓటు వేసే అవకాశం లభిస్తుంది.

కేఎంసీకి రూ.3.37 కోట్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేసింది. రూ.3.37 కోట్లు విడుదల చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నిధులను శానిటేషన్ పనులు, తాగునీటి సరఫరాకు సంబంధించి న పనులకు వినియోగించనున్నారు. నిధుల కొరతతో ఇబ్బంది పడుతున్న కేఎంసీకి ఆర్థిక సంఘం నిధులు రావడంతో ఊరట లభించినట్లయింది.

'గృహజ్యోతి'లో సర్వీస్ నంబర్ నమోదు చేయండి

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రప్రభుత్వం అభయహస్తం ద్వారా సంక్షేమ పథకాలు అమలుకు ప్రజాపాలన సభలు నిర్వహిస్తోంది. అర్హులైన కుటుంబాలకు 'గృహజ్యోతి' ద్వారా నెలనెలా 200 యూనిట్ల విద్యుత్ అందించనున్నట్లు ప్రకటించగా, అన్ని పథకాలతో పాటు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈమేరకు అర్హులైన కుటుంబాలు దరఖాస్తులో గృహజ్యోతి కాలమ్ వద్ద విద్యుత్ బిల్లుపై ఉండే ఎనిమిది అంకెల సర్వీస్ నంబర్ నమోదు చేయాలని ఖమ్మం ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఏ.సురేందర్ సూచించారు.

చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన

కూసుమంచి: మండలంలోని పాలేరు శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా స్థానంలో ప్రపంచ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పరిశోధనా స్థానం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ శ్యాంప్రసాద్ చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. మత్స్య పరిశోధనా స్థానాన్ని వరంగల్ జిల్లా మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన మత్స్య రైతులు సందర్శించారు. సీనియర్ సైంటిస్ట్ శ్యాంప్రసాద్, శాస్త్రవేత్తలు గణేష్, రవీందర్ పాల్గొన్నారు.

పైపైకి విద్యారంగం



మన ఊరు - మన బడి కింద తీర్చిదిద్దిన సింగరెడ్డిపాలెం పాఠశాల

ఈ ఏడాదంతా మంచి శకునములే..

- 'మన ఊరు – మన బడి'తో పాఠశాలలకు హంగులు
- జిల్లాకు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల
- సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా 'డైట్' ఎంపిక
- బదిలీలు, పదోన్నతులతో టీచర్లలో ఆనందం

ఖమ్మం సహకారనగర్: ఈ ఏడాది జిల్లాలో విద్యాశాఖ ముందంజలో నిలిచింది. అన్ని విభాగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో గుర్తింపు సాధించి అగ్రభాగాన నిలిచింది. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలకు న్యాక్ 'ఏ' ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించగా... పాలేరు నియోజకవర్గానికి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల మంజూరైంది. అలాగే, రాష్ట్రంలోని రెండు డైట్ కాలేజీలను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ఎంపిక చేయగా ఖమ్మం కాలేజీకి స్థానం దక్కింది. ఇదిలా ఉండగా ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ ఫలితాల్లోనూ జిల్లా రాష్ట్రస్థాయిలో సత్తా చాటడం విశేషం.

కొత్త ప్రణాళికలతో....

విద్యాశాఖ ఈ ఏడాది మొదటి నుంచి నూతన ప్రణాళికలతో ముందుకు సాగింది. పాఠశాల స్థాయి నుంచి మొదలుకుంటే డిగ్రీ, ఇంజనీరింగ్ వరకు ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో కృషి చేయగా సత్ఫలితాలు వచ్చాయి. పాఠశాల స్థాయిలో తొలిమెట్టుతో విద్యార్థుల్లో సామర్థ్యాలు పెరగగా, మన ఊరు–మన బడి కార్యక్రమాలతో పాఠశాలలకు హంగులు సమకూరాయి. ఇంటర్మీడియట్ విద్యార్థులపైనా ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు.. డిగ్రీ కళాశాలల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు ఉద్యోగాలతో బయటకు వెళ్తున్నారు.

తొలిమెట్టు దోహదం

రాష్ట్ర ప్రభుత్వం 1నుంచి 5వ తరగతి విద్యార్థుల కోసం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. అలాగే, ఏడు నుంచి పదో తరగతి వారి కోసం ఉన్నతి పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమంలో విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు ఉపకరిస్తోంది.

కొత్త హంగులు

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించేందుకు మన ఊరు – మన బడి పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలో 426 పాఠశాలలను ఎంపిక చేయగా.. 233వాటిలో పనులు పూర్తయ్యాయి. మిగతా పాఠశాలల్లోనూ పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ పనులతో పాఠశాలల భవనాలు కొత్త హంగులు అద్దుకోగా, బెంచీలు, డిజిటల్ బోర్డులతో విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరిగినట్లయింది.

బదిలీలు, పదోన్నతులు

ఏళ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టడమే కాక పదోన్నతులు కల్పించింది. సుమారు ఎనిమిదేళ్ల తర్వాత కదలిక రావడంతో ఉపాధ్యాయుల్లో ఆనందం వ్యక్తమైంది. జిల్లాలో 160 మందికి పదోన్నతి లభించగా, 820మందికి బదిలీ అయింది.

ఫలితాలు పర్వాలేదు..

ఈ ఏడాది విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో 18వ స్థానంలో నిలిచింది. మొత్తం 16,826మందికి గాను 14,928మంది పాస్ కావడంతో 88.72శాతంగా ఉత్తీర్ణత నమోదైంది. దీంతో ఈ ఏడాది మరింత ఫలితాలు పెంచేందుకు విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇక ఇంటర్ ద్వితీయ సంవత్సరంల్లో 13,339మందికి గాను 9,964మంది(74శాతం) ఉత్తీర్ణత సాధించగా జిల్లాకు రాష్ట్రంలె నాలుగు స్థానం లభించింది. ప్రథమ సంవత్సరంలో 15,450మందికి 10,456మంది(67శాతం) ఉత్తీర్ణత సాధించగా రాష్ట్ర స్థాయిలో ఏడో స్థానం దక్కింది. జిల్లాకు చెందిన తప్పెట రోహిణి బైపీసీ విభాగంలో 990 మార్కులతో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం విశేషం.

పాలేరులో ఇంజనీరింగ్ కళాశాల

ఏళ్లుగా జిల్లా విద్యార్థులు కోరుతున్న ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ ఎట్టకేలకు మంజూరైంది. తొలుత జిల్లా కేంద్రమైన ఖమ్మంకు వస్తుందని భావించినా, జేఎన్‌టీయూహెచ్‌కు అనుబంధంగా పాలేరు నియోజకవర్గానికి కళాశాలను కేటాయించారు. ఐదు బ్రాంచ్‌ల్లో 300మంది విద్యార్థుల ప్రవేశానికి అవకాశమున్నా అనుమతులు ఆలస్యంగా రావటంతో స్పెషల్ ఫేజ్ కింద రెండు కోర్సుల్లో కలిపి 49మంది విద్యార్థులు చేరారు. ఇక ఖమ్మంలోని డైట్ కళాశాలకు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా రాష్ట్రంలో రెండు కళాశాలలను ఎంపిక చేయగా ఖమ్మంకు చోటుదక్కింది. జాతీయ నూతన విద్యా విధానానికి అనుగుణంగా బోధించే ఉపాధ్యాయులకు ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు.



సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ఎంపికైన డైట్

ఊహించని గుర్తింపు

జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ ఏడాది ఆగస్టు 2వ తేదీన న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) నుంచి ఏ ప్లస్ ప్లస్ గుర్తింపు వచ్చింది. రాష్ట్రంలోని ఏ కళాశాలకు దక్కని ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ రావడం విశేషం.



న్యాక్ ఏ ప్లస్ ప్లస్‌కు ఎంపికైన ఎస్ఆర్‌అండ్ బీజీఎన్ఆర్ కళాశాల

రక్తమోడిన రహదారులు



తల్లంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం (ఫైల్)

- ఈ ఏడాది పెరిగిన రోడ్డుప్రమాద మృతులు
- సైబర్ నేరాల సంఖ్యా ఎక్కువే
- ఇదే సమయాన తగ్గిన దొంగతనాలు
- అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించిన పోలీసులు



ఖమ్మంక్రైం: ఈ ఏడాది జిల్లా రహదారులు రక్తమోడాయి. పెద్ద సంఖ్యలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడ్డారు. అలాగే, చిన్నచిన్న కారణాలతో బలవర్మణాలు కలవరపరిచాయి. ఇక దొంగతనాలు మాత్రం కాస్త తగ్గడం జిల్లా ప్రజలకు ఊరట కలిగించింది. అయితే, సైబర్ నేరాలు పెరగడం సాంకేతిక పరిజ్ఞానాన్ని దుండగులు దుర్వినియోగం చేస్తున్న తీరును తెలియచేస్తోంది.

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం

ఏప్రిల్ 12న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యాన కారేపల్లి మండలం చీమలపాడులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, స్థానికులు చేరుకుంటుండగానే స్థానిక ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో నలుగురు మృతి చెందారు. ఇదే ఘటనలో పలువురు కాళ్లు, చేతులు కోల్పోగా రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

6,894 ఎఫ్ఐఆర్‌లు

ఈ ఏడాది అన్ని కేసులు కలిపి పోలీసులు 6,894 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. గతేడాది 7,304 కేసులు నమోదుకాగా ఈ ఏడాది తగ్గినట్లయింది. ఇక చోరీలు 466 జరగ్గా, చీటింగ్ కేసులు 187, గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటనల్లో 41 కేసులు నమోదయ్యాయి. కాగా, సైబర్ నేరాలు గత ఏడాది 1,249 జరగగా ఈ ఏడాది 1,332 జరగడం కలవరపెడుతోంది. ఇదేసమయాన హత్యలు 28, అత్యాచారాలు 56 జరిగాయి. అయితే, గత ఏడాది వంద పోక్సో కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఒకటే కేసు నమోదు కావడం కాస్త సంతోషించాల్సిన అంశంగా మిగిలిపోయింది. ఇక చోరీ ఘటనల్లో బాధితులు రూ.4.86కోట్ల సొత్తు పోగొట్టుకోగా రూ.1.57 కోట్ల మేర రికవరీ చేశారు.

రక్తసిక్తం

ఈ ఏడాది జిల్లాలో పెద్దసంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. బయటకు వెళ్లిన వారు తిరిగి వచ్చేవరకు నమ్మకం లేకుండా పోయింది. ఈ ఘటనల్లో పలువురు మృతి చెందగా వందలాది మంది క్షతగాత్రులుగా మిగిలారు. 2022లో జిల్లాలో జరిగిన ప్రమాదాల్లో 207 మంది మృతి చెందగా ఈ ఏడాది ఆ సంఖ్య 233కు చేరింది. ఖమ్మంలో టిఫిన్ బండి నడుపుతూ జీవించే ఓ కుటుంబం బంధువుల అంత్యక్రియలకు హాజరై వస్తుండగా తల్లంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త, భార్య, కుమార్తె అక్కడికక్కడే మృతి చెందడం అందరినీ కలవరపెట్టింది. ఇక కొణిజర్ల వద్ద ఆగి ఉన్న లారీకి కారు ఢీకొనగా ఓ కుటుంబం కన్నుమూసింది. దీంతో వారి బంధువుల్లో కన్నీళ్లు ఇంకా ఆరలేదు.

విధినిర్వహణలో భేష్



ఎన్నికల వేళ బందోబస్తులో పాల్గొన్న సీపీ వారియర్, కేంద్ర సాయుధ బలగాలు

ఈ ఏడాది డిసెంబర్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ ఆధ్వర్యాన పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు నిర్వహించారు. మధ్యప్రదేశ్, ఒడిశా పోలీసులతో పాటు కేంద్ర సాయుధ బలగాలు కూడా బందోబస్తులో పాల్గొన్నాయి. ఈమేరకు ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా విధులు నిర్వర్తించిన పోలీసులు భేష్ అనిపించుకున్నారు. కాగా, పోలీసు శాఖ ఆధ్వర్యాన జాబ్‌మేళా ఏర్పాటుచేసి 150కంపెనీల్లో 8,200 మందికి ఉద్యోగాలు ఇప్పించడం విశేషం.

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

- మణుగూరులో బీటీపీఎస్ సందర్శన
- జమలాపురం ఆలయంలో పూజలు

ఖమ్మంవన్‌టౌన్/ఎర్రుపాలెం: డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక, ఇంధనశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరనున్న ఆయన 11.10గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని భద్రాద్రి పవర్ ప్లాంట్‌కు చేరుకుంటారు. అక్కడ ప్లాంట్‌ను పరిశీలించి అధికారులతో సమావేశమవుతారు. ఆతర్వాత ఎర్రుపాలెం మండలం జమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని పూజలు చేశాక ఎర్రుపాలెం మండలంలో మిషన్ భగీరథ పథకంపై అధికారులతో సమీక్షిస్తారు. కాగా, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటన నేపథ్యాన హెలీప్యాడ్ ఇతర ఏర్పాట్లను ఖమ్మం ఆర్డీఓ గణేష్ ఎర్రుపాలెం మండలం పెద్దగోపవరంలో పరిశీలించారు. మధిర సీఐ వసంత్‌కుమార్, తహసీల్దార్ ఉషాశారద, ఎస్ఐ ఎం.సురేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెద్దగోపవరంలో హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ, అధికారులు

ఖమ్మంలో మంత్రి తుమ్మల..

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8గంటలకు హైదరాబాద్ నుండి రోడ్డుమార్గంలో బయలుదేరనున్న ఆయన 11గంటలకు ఖమ్మం చేరుకుంటారు. ఇక్కడ భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే కూచిపూడి నాట్యప్రదర్శనలో పాల్గొంటారు. ఆతర్వాత జాతీయ పెన్షన్‌దారుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొననున్న మంత్రి, మధ్యాహ్నం మూడు గంటలకు వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారు.

ఎన్ఐఏలోకి సీపీ వారియర్

- డిప్యూటేషన్ దరఖాస్తుకు అనుమతి
- కొత్త సీపీగా కోటిరెడ్డి రానున్నారని ప్రచారం

ఖమ్మంక్రైం: దేశంలోని ప్రముఖ దర్యాప్తు సంస్థల్లో ఒకటైన ఎన్ఐఏ(నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) ఎస్పీగా ఖమ్మం పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ బదిలీ అయ్యారు. ఈమేరకు ఆయనను రిలీవ్ చేయాలని కేంద్రప్రభుత్వం శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది.



విష్ణు ఎస్.వారియర్

వారియర్ 2021 ఏప్రిల్ 6న సీపీగా బాధ్యతలు స్వీకరించారు. కరోనా లాక్‌డౌన్ సమయాన ప్రజలు ఇబ్బంది పడకుండా పోలీసు సిబ్బందితో కలిసి శ్రమించారు. అనంతరం ఎమ్మెల్సీ, కార్పొరేషన్ ఎన్నికలతో పాటు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలు సజావుగా సాగేలా కృషి చేశారు. వారానికి రెండు సార్లు గ్రీవెన్స్‌డే నిర్వహిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న పరిష్కారానికి పాటుపడ్డారు. కాగా, కొద్దినెలల ముందే ఆయన డిప్యూటేషన్‌పై ఎన్ఐఏలోకి వెళ్లేందుకు దరఖాస్తులు చేసుకోగా తాజాగా అనుమతి లభించింది. వారియర్ అక్కడ ఐదేళ్ల పాటు డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తించనుండగా, కేరళ లేదా లక్షద్వీప్‌లో విధులు కేటాయించే అవకాశముందని సమాచారం. ఖమ్మంకు కొత్త సీపీని నియమించే వరకు భద్రాద్రి ఎస్పీ వినీత్‌కు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించే అవకాశముంది. అయితే, సీపీగా వచ్చేందుకు పలువురు అధికారులు ప్రయత్నాలు చేస్తుండగా, గతంలో మహబూబాబాద్ ఎస్పీగా పనిచేసిన కోటిరెడ్డి రానున్నట్లు ప్రచారం జరుగుతోంది.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎంతో నమ్మకంతో తనను గెలిపించిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ వెల్లడించారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చేందుకు 'సాక్షి' ఆధ్వర్యాన హలో ఎమ్మెల్యే పేరిట ఫోన్ ఇన్ నిర్వహించగా పలువురు సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె, పట్నం తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఇందుకోసం త్వరలో కార్యచరణ మొదలుపెడతానని తెలిపారు. – వైరా 10లో



క్లుప్తంగా

బస్సు కోసం విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఏన్కూరు: బస్సులు సమయానికి రావడం లేదంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఖమ్మం నుండి ఆర్టీసీ బస్సు పండిగి మీదుగా ఏన్కూరుకు రాకపోకలు సాగిస్తోంది. ఈ బస్సులోనే విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లివస్తారు. అయితే, సాయంత్రం సమయాన బస్సు సమయానికి నడవక ఇళ్లకు వెళ్లేందుకు ఆలస్యమవుతోందని ఆరోపిస్తూ విద్యార్థులు శుక్రవారం ఉదయం ఆందోళనకు దిగారు. ఈమేరకు ఆర్టీసీ అధికారులు ఫోన్ చేసి సమయానికి నడిచేలా పర్యవేక్షిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

డిప్యూటీ సీఎంకు వ్యక్తిగత కార్యదర్శుల నియామకం



శ్రీనివాసరావు



కె.రాజేష్

మధిర: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఇద్దరు వ్యక్తిగత కార్యదర్శులను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టులో సీడీపీఓ విధులు నిర్వర్తిస్తున్న తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు గత ఐదేళ్లుగా మల్లు భట్టి విక్రమార్క వ్యక్తిగత కార్యదర్శి(పీఏ)గా పనిచేస్తున్నారు. మళ్లీ ఆయనను భట్టి పీఏగా నియమించుకున్నారు. అలాగే, మధిర నాయబ్ తహసీల్దార్ కె.రాజేష్‌ను కూడా వ్యక్తిగత కార్యదర్శిగా నియమిస్తూ కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు.

చిన్న మొత్తాల పథకాలపై వడ్డీ రేట్ల సవరణ

ఖమ్మంగాంధీచౌక్: చిన్న మొత్తాల పథకాలపై నాలుగో త్రైమాసికంలో వడ్డీరేట్లను సవరిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి మార్చి 31వ తేదీ వరకు ఈ మార్పు అమల్లోకి వస్తుంది. సుకన్య సమృద్ధి యోజన పథకంలో వడ్డీని 8 నుంచి 8.2 శాతానికి పెంచగా, ఏడాది సేవింగ్ డిపాజిట్‌పై 6.9 శాతం, రెండేళ్ల డిపాజిట్‌పై 7 శాతం, మూడేళ్ల డిపాజిట్‌పై 7.1 శాతం, ఐదేళ్ల సేవింగ్ డిపాజిట్‌పై 7.5 శాతంగా వడ్డీరేట్లను సవరించారు. అలాగే, నెలవారీ ఆదాయ ఖాతా పథకంలో 7.4 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌కు 7.7 శాతం, పబ్లిక్ ప్రావిడెంట్ పథకానికి 7.1 శాతంగా సవరిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

విధుల నుంచి రిలీవ్ అయిన మార్కెట్ కార్యదర్శి

కొత్త కార్యదర్శిగా సంతోష్‌కుమార్?

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా విధులు(ఆన్‌డ్యూటీ) నిర్వర్తిస్తున్న రుద్రాక్షి మల్లేశం శుక్రవారం రిలీవ్ అయ్యారు. మార్కెట్ గ్రేడ్–2 కార్యదర్శిగా పనిచేస్తున్న బి.బజార్‌కు ఆయన బాధ్యతలు అప్పగించారు. హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా పనిచేస్తున్న మల్లేశంను 2020 జూలైలో ఖమ్మం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా నియమించారు. అప్పటి నుంచి విధులు నిర్వర్తిసుత్ను ఆయనను తిరిగి హుజూర్‌నగర్ మార్కెట్‌కు కేటాయించారు. ఆయన స్థానంలో ఖమ్మం మార్కెట్‌కు ఉన్నత శ్రేణి కార్యదర్శిని నియమించాల్సి ఉంది. కాగా, గతంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిగా, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా పనిచేసిన రత్నం సంతోష్‌కుమార్ తిరిగి అదే బాధ్యతల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన నేలకొండపల్లి మార్కెట్ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిగా రెగ్యులర్ అధికారి లేకపోవడంతో సీనియర్ అయిన సంతోష్‌కుమార్‌కు ఆ బాధ్యతలు అప్పగించడమే కాక ఖమ్మం మార్కెట్‌కు కేటాయించే అవకాశముందని సమాచారం.

తమ్మినేని కృష్ణయ్య కుమారుడికి గన్‌మెన్లు

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తమ్మినేని నవీన్‌కు ప్రభుత్వం శుక్రవారం ఇద్దరు గన్‌మెన్లను కేటాయించింది. ఆయన తండ్రి కృష్ణయ్య ఆగస్టు 15న హత్యకు గురైన విషయం విదితమే. కాగా, తుమ్మల నాగేశ్వరరారరావుకు కృష్ణయ్య ప్రధాన అనుచరుడిగా కొనసాగారు. ఇంతలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, తుమ్మలతో పాటు పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కాగా, నవీన్‌కు సైతం ప్రత్యర్థుల నుంచి ముప్పు ఉందనే సమాచారంతో ఆయనకు ఇద్దరు గన్‌మెన్లను ప్రభుత్వం కేటాయించింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,454

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రజల బాగోగులే నా మొదటి అజెండా
- 'ప్రజాపాలన'లో అందరికీ న్యాయం
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా: నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిండమేకాక పాలనలో ఇబ్బందులు రాకుండా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు కృషిచేస్తానని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ తెలిపారు. పల్లె, పట్టణం, మారుమూల తండాలనే తేడా లేకుండా సమగ్రాభివృద్ధే తన ధ్యేయమని పేర్కొన్నారు. ఎన్నో ఆశలతో తనను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోలేనిదని.. సమస్యల పరిష్కారం ద్వారా వారికి కృతజ్ఞతలు చెప్పుకుంటానని తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనతో ప్రజలు నేరుగా మాట్లాడి సమస్యలు చెప్పుకునేందుకు 'సాక్షి' ఆధ్వర్యాన శుక్రవారం 'హలో ఎమ్మెల్యే' పేరిట ఫోన్ ఇన్ ఏర్పాటుచేయగా మంచి స్పందన లభించింది. సుమారు వంద మందికి పైగా ఫోన్ చేయగా ఎమ్మెల్యే 30 మందితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన వచ్చినందునప్రతీ పేదవాడి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యమని తెలిపారు. గత పదేళ్లలో గిరిజన గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేని, ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. ఈమేరకు ప్రజల్లో కొందరు అడిగిన ప్రశ్నలు, ఎమ్మెల్యే ఇచ్చిన సమాధానాలు ఇలా ఉన్నాయి.



ప్రశ్న : ఎస్సీ కాలనీలో సబ్‌సెంటర్ ఉన్నా భవనం శిథిలావస్థకు చేరింది. సిబ్బంది వస్తే కాలనీవాసులకు వైద్యం అందుతుంది.
– రాంబాబు/ షబ్బీర్, భాగ్యనగర్‌తండా

ఎమ్మెల్యే : సబ్‌సెంటర్‌ను మరమ్మతులు చేయించి సిబ్బంది విధులకు హాజరయ్యేలా చూస్తాం. ఎస్సీ కాలనీలో సమస్యలు పరిష్కరిస్తా.

ప్రశ్న : వల్లాపురం, పాలడుగు బీటీ రోడ్డు శిథిలావస్థకు చేరింది. అదే రహదారిపై వంతెన కూడా కూలిపోయింది. బ్రిడ్జి నిర్మిస్తే రెండు గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలుగుతాయి.
– తుమ్మల రాణాప్రతాప్, వల్లాపురం / రాంబాబు, తీగలబంజర

ఎమ్మెల్యే : రోడ్లు, వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య సాధ్యమైనంత త్వరగా పరిష్కారమయ్యేలా చూస్తా.

ప్రశ్న : జూలూరుపాడులో శాశ్వత వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలి. గతంలో స్థలం కేటాయించినా నిర్మాణం చేపట్టలేదు. మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తే రైతులకు సౌకర్యవంతంగా ఉంటుంది.
– వేల్పుల నర్సింహారావు, జూలూరుపాడు

ఎమ్మెల్యే : రెవెన్యూ అధికారులతో మాట్లాడి యార్డు నిర్మాణమయ్యేలా చూస్తాను. త్వరలో రెండు శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తాం.



ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్

ప్రశ్న : చాలా గ్రామాల్లో సీసీ రోడ్లు ఉన్నా డ్రెయినేజీలు లేక సమస్యలు ఎదురవుతున్నాయి.
– సూర్య, నూకలంపాడు / ఎల్.గోపాల్‌రావు తనికెళ్ల / రామకృష్ణ, కారేపల్లి

ఎమ్మెల్యే : చాలా గ్రామాల్లో సీసీ రోడ్లు ఉన్నా డ్రెయినేజీలు నిరిమంచలేదు. తప్పకుండా పూర్తి స్థాయిలో డ్రెయినేజీలు నిర్మాణం చేపట్టేలా అవసరమైన నిధులు మంజూరు చేయిస్తా.

ప్రశ్న : కారేపల్లి పదో వార్డులో పదేళ్లుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.
– సాయికుమార్/రామకృష్ణ, కారేపల్లి / హరి, జైత్రాంతండా / సతీష్, కారేపల్లి

ఎమ్మెల్యే : తాగునీటి సమస్య లేకుండా పరిష్కారం చేస్తాను. కాలనీలో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాము. త్వరలోనే నిధులు మంజూరవుతాయి.

ప్రశ్న : జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నందున నాలుగు లేన్లుగా విస్తరించాలి.
– సుధీర్, పల్లిపాడు

ఎమ్మెల్యే : రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులతో చర్చిస్తాం. నాలుగు లైన్ల రహదారి నిర్మాణంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

ప్రశ్న : పట్టాలు ఇచ్చిన పోడు భూముల్లో బోర్లు వేయిస్తే మా సమస్య పరిష్కారమవుతుంది.
– రాంబాబు, మాణిక్యారం / బాలు, వినోభానగర్ / నారపోగు నాగరాజు, కేజీ సిరిపురం

ఎమ్మెల్యే : పోడుభూములకు పట్టాలిచ్చే కార్యక్రమం చేపట్టి ఆ భూముల్లో బోర్లు వేయిస్తాం. ఐటీడీఏ ద్వారా గిరిప్రభ పథకం ద్వారా బోర్లు వేయించే కార్యక్రమం త్వరలోనే చేపడతా.

ప్రశ్న : జూలూరుపాడులో 30 పడకల ఆస్పత్రి ఉన్నా వైద్యం అందడం లేదు. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయించి వైద్యసేవలు అందేలా చూడండి.
– పి.నాగరాజు, జూలూరుపాడు

ఎమ్మెల్యే : ఆస్పత్రి అప్‌గ్రేడ్‌పై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడతాను. అవసరమైతే ఆరోగ్యశాఖ మంత్రికి సమస్యను తీసుకెళ్తా.

ప్రశ్న : కారేపల్లిలో అత్యవసర పరిస్థితుల్లో 108 సౌకర్యం లేక ఇబ్బంది ఎదురవుతోంది.
– గాంధీ, భాగ్యనగర్‌తండా

ఎమ్మెల్యే : మండలానికి 108 వాహనం మంజూరు చేసేలా జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడతాను.

ప్రశ్న : మా గ్రామంలో పశువుల ఆస్పత్రి నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది.
– ఐనాల కనకరత్నం, కేజీ సిరిపురం

ఎమ్మెల్యే : అసంపూర్తిగా ఉన్న పశువుల దవాఖానా నిర్మాణం పూర్తయ్యేలా అధికారులతో చర్చించి త్వరలోనే పనులు మొదలుపెడతాం.

ప్రశ్న : వైరా మున్సిపాలిటీ పరిధిలో డ్రెయినేజీలకు గోతులు తీసినా నిర్మాణం జరగకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.
– అరుణ్‌తేజ్, వైరా / నాగబాబు, అమ్మపాలెం/ సతీష్, గేటు కారేపల్లి

ఎమ్మెల్యే : మున్సిపాలిటీతో పాటు అన్ని గ్రామాల్లో డ్రెయినేజీల నిర్మాణం పూర్తయ్యేలా అధికారులతో మాట్లాడతా. ప్రమాదకరంగా ఉన్న చోట్ల తొలుత పనులు చేపడుతాం.

ప్రశ్న : నాలుగేళ్లుగా వైరా నుండి నెమలికి ఆర్టీసీ బస్సు లేకపోవడంతో విద్యార్థులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.
– ఎం.రత్నరాజు, గరికపాడు

ఎమ్మెల్యే : వైరా, నెమలి రూట్‌లో త్వరలోనే బస్సు నడిపించేలా ఆర్టీసీ అధికారులతో మాట్లాడతా. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టాక బస్సులకు డిమాండ్ పెరిగింది.

ప్రశ్న : గ్రామంలో ఫ్లోరైడ్ సమస్య తీవ్రంగా ఉన్నందున మిషన్ భగీరథ నీళ్లు వచ్చేలా చూడండి.
– ముత్తయ్య, శ్రీరామగిరి

ఎమ్మెల్యే : ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తాం. కిడ్నీ బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా అధికారులతో చర్చిస్తాను.

ప్రశ్న : మా గ్రామంలో శివాలయానికి తొమ్మిది ఎకరాల భూమి ఉన్నా ఆలయ అభివృద్ధి జరగడం లేదు.
– ఏ.రాంబాబు, పాపకొల్లు

ఎమ్మెల్యే : దేవాదాయ శాఖ అధికారులతో మాట్లాడి శివాలయం అభివృద్ధి జరిగేలా చూస్తా. భూమి స్థాయి సర్వే చేయించి నిత్యపూజలు జరిగేలా ఏర్పాట్లు చేయిస్తాం.

ప్రశ్న : వైరా రిజర్వాయర్‌లో 14 అడుగుల మేర నీరు ఉంటేనే సాగు, తాగు అవసరాలకు ఇస్తున్నారు. ఎప్పటికీ 15 అడుగుల మేర నీరు ఉండేలా చర్యలు చేపట్టండి.
– యలమందల నగేష్, తాటిపూడి

ఎమ్మెల్యే : వైరా రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీరు ఉండేలా పర్యవేక్షిస్తూ తాగు, సాగు నీటికి ఇబ్బంది రాకుండా చూస్తా. రిజర్వాయర్ కాల్వల్లో పూడికలు తీయించేలా నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకునేలా చూస్తా.

'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోండి

- గడువు దాటాక కూడా దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా నోడల్ అధికారి రఘునందన్‌రావు
- రెండోరోజు 40,667 దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మంఅర్బన్: ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా నోడల్ అధికారి ఎం.రఘునందన్‌రావు సూచించారు. ప్రజాపాలన కార్యక్రమ పర్యవేక్షణ కోసం నియమితులైన ఆయన కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి ఖమ్మం 7వ డివిజన్‌లోని మహిళా ప్రాంగణం, టేకులపల్లి డబుల్ బెడ్‌రూం సముదాయంలో ఏర్పాటుచేసిన గ్రామసభలను పరిశీలించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ అధికారులు ఈ కార్యక్రమ ప్రత్యేకత గుర్తించి, చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని సూచించారు. దరఖాస్తుదారులకు రశీదు ఇవ్వడంతో అందరి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కాగా, సభల్లో దరఖాస్తు సమర్పించేందు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ ఉంటే సరిపోతుందని తెలిపారు. రేషన్‌కార్డు లేని వారు ఇంటి యజమాని పేరిట ఉన్న కార్డు నెంబర్‌తో దరఖాస్తు చేసుకోవచ్చని, జనవరి 6వ తేదీ తర్వాతకూడా దరఖాస్తులు ఇవ్వొచ్చని వెల్లడించారు.

అర్హులందరికీ లబ్ధి

కూసుమంచి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలు అర్హులందరికీ అందేందుకే దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నోడల్ అధికారి రఘునందన్‌రావు కోరారు. కూసుమంచి మండలం గైగోళ్లపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభను ఆయన కలెక్టర్ గౌతమ్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా దరఖాస్తుదారులతో మాట్లాడి వివరాలు ఆరా తీయడంతో పాటు అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రాజేశ్వరి, డీఆర్‌డీఓ విద్యాచందన, డీపీఓ హరికిషన్, డీఈఓ సోమశేఖరశర్మ, డీఎస్‌ఓ శ్రీలత, మహిళా ప్రాంగణం అధికారి విజేత, తహసీల్దార్ చిట్టింస్వామి, డీటీ సురేష్, సర్పంచ్ ముల్కూరి శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టేకులపల్లిలో మాట్లాడుతున్న నోడల్ అధికారి రఘునందన్‌రావు, పక్కన కలెక్టర్, అధికారులు

109సభలు.. 40,667 దరఖాస్తులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని గ్రామాలు, మున్సిపాలిటీల్లో రెండో రోజైన శుక్రవారం 109చోట్ల ప్రజాపాలన సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా 40,667దరఖాస్తులు అందాయని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. రెండు రోజుల్లో కలిపి 66,018 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. కాగా, శనివారం ఇదిలా ఉండగా శనివారం జిల్లాలో 117 ప్రజాపాలన గ్రామసభలు జరగనున్నాయి.

ఖమ్మం మార్కెట్‌కు మహర్దశ

- మంత్రి తుమ్మల ఆదేశాలతో 'మోడల్' మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు కసరత్తు
- త్వరలోనే అధునాతన హంగులతో నిర్మాణాలు
- వనరులు, స్థితిగతులను పరిశీలించిన రాష్ట్ర బృందం

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రంలోనే ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. రైతులకు ఉపయోగపడేలా సౌకర్యాలు కల్పించడంతో పాటు అధునాతన హంగులు సమకూర్చేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలుస్తుండగా రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచే కాక ఏపీలోని వివిధ జిల్లాల నుంచి రైతులు పంట ఉత్పత్తులను తీసుకొస్తుండడంతో ఏటా రూ.2వేల కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల మేర టర్నోవర్ జరుగుతోంది. తాజాగా ఏర్పడిన ప్రభుత్వంలో ఖమ్మం నుంచి గెలిచిన తుమ్మల నాగేశ్వరరావుకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మంత్రి పదవి దక్కడంతో ఖమ్మం మార్కెట్‌పై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు.

ఇటీవల డైరెక్టర్ పర్యటన

ఖమ్మం మార్కెట్‌ను సందర్శించి సమగ్ర నివేదిక ఇవ్వాలని మంత్రి తుమ్మల ఆదేశించటంతో ఇటీవల రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఉన్నతాధికారులు సందర్శించారు. రూ.10.30 కోట్లతో నిర్మిస్తున్న రెండు కవర్ షెడ్లు, సీసీ రోడ్లు, డ్రెయిన్లను పరిశీలించి అపరాల యార్డు, మిర్చి యార్డు, పత్తి యార్డుల వివరాలు ఆరా తీశారు.



మిర్చి యార్డులో పరిశీలిస్తున్న బృందం

అనంతరం వారు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఖమ్మం మార్కెట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. దీంతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఆర్కిటెక్చర్ బృందాన్ని రంగంలోకి దింపగా హైదరాబాద్‌కు చెందిన బృందం గురువారం మార్కెట్‌ను పరిశీలించింది. డ్రోన్ కెమెరాలతో మార్కెట్ మొత్తాన్ని సర్వే చేయించి పత్తి, మిర్చి, అపరాల యార్డుల్లో ఉన్న నిర్మాణాలు, షెడ్లు, గోదాములను పరిశీలించారు. అనంతరం అధికారులు, వ్యాపార ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. త్వరలోనే పూర్తిస్థాయి అధ్యయనం చేసి అన్ని హంగులతో మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దనున్నట్లు బృందం వెల్లడించారు. ఆర్కిటెక్చర్ అండ్ అర్బన్ ప్లానింగ్ బృందం చిలకమర్రి శ్రీకామల్, సుంకర ప్రవీణ్, ఎస్ స్మిత, ఉమామహేశ్వరావు, సర్వేయర్ పి శ్రీధర్‌బాబు, ఖమ్మం చాంబర్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం, గ్రేడ్–2 కార్యదర్శి బి బజార్, సహాయ కార్యదర్శి ఎండీ.వజీరుద్దీన్‌తో పాటు వ్యాపార ప్రతినిధులు దిరిశాల వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు, నల్లమల ఆనంద్, తేరాల ప్రవీణ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళా కానిస్టేబుల్ మృతి

భర్తే ఉరివేసి హత్య చేశాడంటున్న మృతురాలి బంధువులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 4వ డివిజన్ బాలాజీనగర్‌లో నివాసముంటూ భద్రాది కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న మీగడ స్వాతి (29) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఖమ్మం అర్బన్ ఎస్‌ఐ పి.వెంకన్న కథనం ప్రకారం.. స్వాతి రెండేళ్ల కిందట ఖమ్మంలో విధులు నిర్వర్తిస్తున్న సమయాన రాజీవ్‌నగర్‌గుట్టకు చెందిన కారుడ్రైవర్ ప్రవీణ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. కొన్ని నెలలు పాటు దాంపత్య జీవితం సజావుగానే సాగింది. వీరికి 19 నెలల కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా వరకట్నం తీసుకురావాలని ప్రవీణ్ వేధిస్తుండడంతో స్వాతి అప్పు చేసి రూ.9 లక్షలు, తండ్రి నుంచి మరో రూ.14 లక్షలకు పైగా ఇప్పించింది. అయినా సంతృప్తి చెందని ప్రవీణ్ మద్యం సేవిస్తూ ఏపని చేయకుండా నిత్యం వేధించేవాడు. ఈ క్రమంలోనే గురువారం ఇంట్లో స్వాతి, ప్రవీణ్ ఘర్షణ పడినట్లు తెలుస్తుండగా పెద్దగా శబ్దాలు వచ్చాయని స్థానికులు తెలిపారు. దీంతో సమీపంలోనే ఉండే స్వాతి సోదరి కవిత వచ్చేసరికి స్వాతి కిందపడుకుని, ఉందని, ఏమైందని ఆరా తీస్తే ఉరి వేసుకుందని ప్రవీణ్ చెప్పాడని కవిత వెల్లడించింది. అనంతరం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. కాగా, ప్రవీణ్ ఉరి వేసి స్వాతిని హత్య చేసినట్లు తమకు అనుమానాలు ఉన్నాయని కవిత ఇచ్చిన ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



స్వాతి (ఫైల్)

మహిళా కానిస్టేబుల్‌కు నివాళి

ముదిగొండ: భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్ మీగడ స్వాతి ఖమ్మంలో గురువారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని స్వగ్రామమైన ముదిగొండ గోకినేపల్లికి శుక్రవారం తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, ఎస్‌ఐలు సంతోష్, నరేశ్, పోలీస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి జానీ మియా తదితరులు స్వాతి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

12.4 కేజీల ఎండుగంజాయి స్వాధీనం

వైరా: ద్విచక్రవాహనంపై తరలిస్తున్న రూ.3లక్షల విలువైన ఎండు గంజాయిని వైరా ఎక్సైజ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిటెండెంట్ కె.తిరుపతి నేతృత్వాన సీఐలు రమ్య, సర్వేశ్వరరావు, సిబ్బంది వైరా శివార్లలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో ఓ వ్యక్తి అనుమానస్పదంగా కనిపించగా ద్విచక్రవాహనంలో తనిఖీ చేయడంతో రూ.3లక్షల విలువైన 12.4 కేజీల ఎండు గంజాయి లభించింది. ఆయనను ఒడిషా రాష్ట్రానికి చెందిన బ్రజేశ్వర్ బైద్యగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో ఎస్‌ఐ కిరిటీ, సిబ్బంది కరీమ్, సుధీర్, హన్మంతరావు, హరీష్, నాగేశ్వరరావు, రవి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



పట్టుబడిన యువకుడు, గంజాయితో ఎక్సైజ్ అధికారులు

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమంలో ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు ఫిర్యాదికి రూ.6 లక్షలు చెల్లించాలంటూ ఖమ్మం మద్యపాన అబ్కారీ ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి రాళ్లబండి శాంతిలత శుక్రవారం తీర్పు చెప్పారు. ఖమ్మం శ్రీనగర్ కాలనికి చెందిన కోయినేని జయలక్ష్మి వద్ద బ్యాంకు కాలనీకి చెందిన చీకటి నర్సింహారావు వ్యాపార అవసరాల నిమిత్తం 2015లో రూ.4లక్షల అప్పు తీసుకున్నాడు. అయితే, తిరిగి ఇచ్చే క్రమాన 2017లో చెక్కు జారీ చేయగా, ఆ చెక్కును జయలక్ష్మి ఖాతాలో జమ చేస్తే నగదు నిల్వ లేకపోవడంతో తిరస్కరణకు గురైంది. దీంతో ఆమె న్యాయవాది ముప్పా నాగేశ్వరరావు ద్వారా కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేయడంతో విచారణ అనంతరం నర్సింహారావుకు జైలుశిక్ష విధించడంతో పాటు నగదు చెల్లించాలని తీర్పు చెప్పారు.

మరొకరికి నాలుగు నెలలు...

ఖమ్మంకు చెందిన చప్పిడి నాగులు వద్ద వి.యేసురత్నం డానియల్ వ్యాపార అవసరాల కోసం 2015లో రూ.6లక్షలు అప్పు తీసుకున్నాడు. తిరిగి 2017లో యేసురత్నం చెక్కు జారీ చేయగా ఆయన ఖాతాలో నగదు లేకపోవడంతో బౌన్స్ అయింది. దీంతో నాగులు న్యాయవాది మరికంటి వెంకట్ ద్వారా కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేయగా విచారణ అనంతరం యేసురత్నంకు నాలుగు నెలల జైలు శిక్షతో పాటు ఫిర్యాదికి రూ.10లక్షలు చెల్లించాలని ఖమ్మం మొదటి అదనపు శ్రేణి న్యాయస్థానం న్యాయాధికారి కాసరగడ్డ దీప తీర్పు వెలువరించారు.

రూ.2లక్షల విలువైన మిర్చి చోరీ

వైరా: కల్లంలో ఆరబోసిన మిర్చిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన వైరా మున్సిపాలిటీ పరిధి 14 వ వార్డు శాంతినగర్ సమీపాన చోటు చేసుకుంది. శాంతినగర్ సమీపాన పొలంలో రైతు కొల్లి నర్సింహారావు గురువారం రాత్రి మిర్చి ఆరబోశాడు. శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా రూ.2 లక్షల విలువైన ఎనిమిది క్వింటాళ్ల మిర్చి చోరీ జరిగినట్లు గుర్తించాడు. ఈమేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

సీసీ పుటేజీలో నిందితులను గుర్తించిన బాధితురాలు

కొణిజర్ల: సాయంత్రం పూట వాకింగ్ చేస్తున్న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన ఇది. కొణిజర్ల మండలం లాలాపురం గ్రామానికి చెందిన నున్నా సావిత్రమ్మ గురువారం సాయంత్రం గ్రామ శివారు రోడ్డుపై వాకింగ్ చేస్తుండగా పల్లిపాడు, ఏన్కూరు రోడ్డులో ద్విచక్రవాహనం పై ముగ్గురు వ్యక్తులు వచ్చారు. ఇందులో ఒకరు కిందకు దిగి సావిత్రమ్మ వద్దకు వచ్చి సుబాబుల్ కొనే వారున్నారా అని ఆరా తీస్తూ ఆమెను కిందకు నెట్టేసి మెడలో ఉన్న సుమారు 3 తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. ఈ మేరకు సావిత్రమ్మ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ శంకరరావు శుక్రవారం సమీప దుకాణాల్లో సీసీ టీవీ పుటేజీలు పరిశీలించారు. అయితే, ద్విచక్రవాహనంపై వెళ్తున్న నిందితులను సావిత్రమ్మ గుర్తించగా, వారి ఫొటోల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



పోలీసులు విడుదల చేసిన నిందితుల ఫొటో

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

తల్లాడ: తల్లాడ సమీపాన శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మృతి చెందింది. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి సావిత్రి(50) పొలంలో పనికి వెళ్లి తిరిగి టీవీఎస్ మోపెడ్‌పై వెనుక కూర్చొని తల్లాడ వైపు వస్తోంది. వైరా రోడ్డులో వే బ్రిడ్జి వద్ద వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ట్రాలీ ఆటో వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సావిత్రి అక్కడికక్కడే మృతి చెందింది.



సావిత్రి (ఫైల్)

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

సత్తుపల్లిటౌన్: పిచ్చికుక్క స్వైరవిహారం చేయడంతో నలుగురికి గాయాలయ్యాయి. సత్తుపల్లి వెంగళరావునగర్ రోడ్–4 నుంచి జలగంనగర్ వరకు రహదారి పక్కన నడుస్తూ వెళ్తున్న టి.కిరణ్, ఐ.గ్రీష్మ, వి.సంతోషం, ముజ్జును శుక్రవారం సాయంత్రం పిచ్చికుక్క గాయపర్చింది. దీంతో వీరికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించారు. కాగా, పట్టణంలో కుక్కల బెడద పెరిగినా నియంత్రించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

తాగి తిడుతున్నాడని కత్తితో దాడి

కారేపల్లి: పాతకక్ష్యల నేపథ్యాన మద్యం తాగొచ్చి తిడుతున్నాడని ఆగ్రహించిన ఓ వ్యక్తి కత్తి పొట్టలో పొడిచిన ఘటన మండలం గేటురేలకాయలపల్లి జీపీ పరిధి రంగురాళ్లబోడులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగురాళ్లబోడుకు చెందిన బానోతు రాజు, గుగులోతు బాలాజీ మధ్య మధ్య పాతకక్ష్యలు ఉన్నాయి. దీంతో రాజు శుక్రవారం రాత్రి మద్యం సేవించి దూషిస్తుండగా, ఆగ్రహించిన బాలాజీ కత్తి పట్టుకుని వచ్చి గొడవకు దిగాడు. అయినా రాజు తగ్గకపోవడంతో బాలాజీ కత్తితో విచక్షణా రహితంగా పొడిచాడు. రాజు పొట్ట భాగంలో కత్తిపోట్లు పడడంతో పేగులు బయటికి వచ్చి తీవ్ర రక్తస్రావమైంది. దీంతో స్థానికులు ఆయనను ఇల్లెందుకు అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలియగా కారేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.